సాక్షి
చిత్తూరు
సోమవారం । 28 । ఆగస్టు । 2023



భక్తజన బోయకొండ

బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తజనసంద్రమైంది. ఉదయం నుంచే క్యూలు కిక్కిరిశాయి.

- 8లో



విద్యా సంస్కరణల ఆద్యుడు సీఎం జగన్

విద్యారంగంలో సంస్కరణలు చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	26
తిరుపతి	37	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	27

నేడు నగరికి సీఎం జగన్

- రాష్ట్ర స్థాయి విద్యాదీవెన కార్యక్రమం
- రూ.5 కోట్లతో పునరుద్ధరించిన ప్రాంతీయ ఆస్పత్రి ప్రారంభం
- రూ.26 కోట్ల అంచనాలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ముస్తాబైన నగరి.. భారీ బందోబస్తు

సాక్షి, చిత్తూరు : రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే సాటిలేని సంక్షేమ సారథిగా ప్రజల గుండెల్లో నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నగరికి విచ్చేయనున్నారు. ఇక్కడి నుంచి 'జగనన్న విద్యాదీవెన'(ఫీజు రీయింబర్స్‌మెంట్)లో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికం నిధులను తల్లుల ఖాతాల్లో లాంఛనంగా జమ చేయనున్నారు. జిల్లాలో 34,388 మంది విద్యార్థులకు సంబంధించి 31,180 మంది తల్లుల ఖాతాల్లో రూ. 22.01కోట్ల నగదు జమ కానుంది.

రూ.5 కోట్లతో ఆస్పత్రి ఆధునీకీకరణ

నగరిలో రూ.5 కోట్లతో నూతన హంగులతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునికీకరించిన ప్రాంతీయ వైద్యశాలను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అలాగే సుమారు రూ.26 కోట్ల అంచనాలతో కూడిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో రూ.18.69 కోట్ల అంచనాలతో నగరిలో పోలీస్‌స్టేషన్ శాశ్వత భవన నిర్మాణం, పుత్తూరు మండలంలో రూ.7.25 కోట్ల అంచనాలతో గురుకుల బాలుర పాఠశాల శాశ్వత భవన నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు.

భారీ స్వాగత ఏర్పాట్లు

ముఖ్యమంత్రి రాక సందర్భంగా భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఆర్కే రోజా, ముఖ్యమంత్రి పర్యటనల సలహాదారు తలశిల రఘురాంతో పాటు జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో భారీ స్వాగత ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. స్వాగత తోరణాలతో నగరి పట్టణం పండుగ శోభను సంతరించుకుంది.



నగరిలో ముఖ్యమంత్రి సభకు ముస్తాబైన వేదిక

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..

- ఉదయం 9.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. 9.55కు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నగరి మండలం కీలపట్టు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు
- 10.45 సభాస్థలికి రోడ్డు మార్గాన విచ్చేస్తారు.
- 12.35 గంటలకు జగనన్న విద్యాదీవెన ప్రారంభిస్తారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.
- 1.45కు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి గన్నవరం చేరుకుంటారు.

తలరాతలు మారేలా చదువు

నాడు : టీడీపీ పాలనలో ఉన్నత విద్య చదివే విద్యార్థులను మోసం చేసి ఇబ్బందులు పెట్టారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి యువత భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చేశారు. చంద్రబాబు పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఏనాడు పట్టించుకోలేదు. ఇంజినీరింగ్, డిగ్రీ, ఇతర ఉన్నత కోర్సులు చదివే విద్యార్థులకు సకాలంలో నిధులు విడుదల చేయక పోవడంతో కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు పెట్టేవి. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుందన్న ఆశతో ఉన్నత కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఎన్నో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. విద్యార్థులు కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి. ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు అప్పుల పాలయ్యారు.

నేడు : దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో 2004లో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించారు. మహానేత మరణించిన తర్వాత చంద్రబాబునాయుడు ఆ పథకాన్ని నిర్లక్ష్యం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. పేదరికం నుంచి బయటపడాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని భావించిన ముఖ్యమంత్రి ఏటా ఇచ్చిన మాట ప్రకారం జగనన్న విద్యాదీవెన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మంజూరు చేస్తున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది. అర్హులైన విద్యార్థులకు ఏటా నాలుగు విడతలుగా పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అందజేస్తోంది.

- పేదల పెద్ద చదువులకు జగనన్న విద్యా దీవెన భరోసా
- క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల చెల్లింపు
- టీడీపీ కంటే భిన్నంగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- నేడు నగరిలో రాష్ట్ర స్థాయి జగనన్న విద్యాదీవెన కార్యక్రమం
- ఏప్రిల్, మే,జూన్ త్రైమాసిక నిధులు జమ చేయనున్న సీఎం జగన్



నగరిలో రాష్ట్ర స్థాయి జగనన్న విద్యాదీవెన కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించాలనే సమున్నత లక్ష్యంతో జగనన్న విద్యాదీవెన పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారు. విద్యార్థుల ఉన్నత చదువులకు ఏ మాత్రం ఇబ్బందులు కలగకుండా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదును జమ చేస్తూ అండగా నిలుస్తున్నారు. ఈ పథకంలో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఏటా ప్రతి త్రైమాసికంలో అందిస్తున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులకు విద్యాదీవెన భరోసా కల్పిస్తోంది. ఈ పథకం అమలుతో ఇంటర్‌తోనే ఫుల్‌స్టాఫ్ పెట్టే పరిస్థితి నుంచి పేద, మధ్యతరగతి విద్యార్థులు బీటెక్, డిగ్రీ, బీఫార్మసీ తదితర ఉన్నత చదువుల వైపు అడుగులు వేస్తున్నారు.



ఏర్పాట్ల పరిశీలనలో ఎంపీ మిథున్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్న విద్యాదీవెన పథకం (ఫీజురీయింబర్స్‌మెంట్)తో వేలాది మంది విద్యార్థుల కుటుంబాల్లో వైఎస్సార్‌సీపీ సర్కారు విద్యాసుగంధాలు నింపుతోంది. పేద విద్యార్థులకు చదువు కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తోంది. ఉన్నత విద్య అభ్యసించే వారికి ఆర్థికసాయం చేస్తూ అండగా నిలుస్తోంది. ఏటా జగనన్న విద్యా దీవెన కింద డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోంది. చంద్రబాబు పాలనలో ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులు పెట్టారు. కళాశాలల యాజమాన్యాలకు మేలు కలిగేలా 30 శాతం ఫీజులను పెంచి విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుల పాలయ్యేలా చేశారు. ఎన్నికలకు ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెంచుతామంటూ మభ్యపెట్టేందుకు ప్రయత్నించారు. గతంలో ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వక పోవడంతో విద్యార్థులు కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేది. తరగతులను మానుకుని అలా తిరిగినప్పటికీ వారి ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి త్రైమాసికంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేస్తోంది. ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆత్రైమాసికం వైఎస్సార్ సీపీ సర్కారు చెల్లిస్తోంది. కుటుంబంలో ఉన్నత చదువులు చదివే విద్యార్థులు ఎంత మంది ఉంటే అంత మందికి మేలు కలిగేలా వారి తల్లుల ఖాతాల్లో నేరుగా జగనన్న విద్యాదీవెన నగదును ప్రభుత్వం జమచేస్తోంది. ఈ పథకం అమలుతో జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పాసై ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థుల శాతం పెరిగిందని అధికారులు,విద్యా వేత్తలు వెల్లడిస్తున్నారు.

నేటి సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలోని నగరి నియోజకవర్గ కేంద్రంలో సోమవారం నిర్వహించే జగనన్న విద్యాదీవెన రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి విచ్చేయనున్నారు. ఈ మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జగనన్న విద్యాదీవెన (ఏప్రిల్, మే, జూన్–2023 త్రైమాసికం) పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తారు. చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 34,388 మంది విద్యార్థులకు గాను 31,180 మంది తల్లుల ఖాతాల్లో రూ. 22.01 కోట్లు జమ కానుంది. జిల్లాలోని చిత్తూరు, జీడీ నెల్లూరు, కుప్పం, నగరి, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలో 2019 నుంచి ఇప్పటి వరకు 1,98,129 మంది విద్యార్థులకు రూ.306.94 కోట్లు జగనన్న విద్యా దీవెన పథకంతో లబ్ధి చేకూరింది.

2019 నుంచి ఇప్పటి వరకు లబ్ధి ఇలా..

నియోజకవర్గం	లబ్ధిదారులు	వ్యయం(రూ.కోట్లల్లో)
చిత్తూరు	23,229	39.24
జీడీ నెల్లూరు	32,685	52.42
కుప్పం	24,467	33.61
నగరి	16,596	22.18
పలమనేరు	34,919	48.02
పుంగనూరు	36,490	58.55
పూతలపట్టు	29,743	52.91
మొత్తం	1,98,129	306.94

ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికం (2023) లబ్ధి ఇలా..

నియోజకవర్గం	విద్యార్థులు	తల్లులు	జమ రూ.కోట్లలో
చిత్తూరు	3,904	3,483	2,73,46,321
జీడీ నెల్లూరు	5,614	5,005	3,87,07,047
కుప్పం	4,299	3,994	2,49,45,579
నగరి	2,941	2,649	1,74,83,166
పలమనేరు	6,320	5,791	3,57,26,208
పుంగనూరు	6,333	5,778	3,96,01,605
పూతలపట్టు	4,977	4,480	3,63,27,074
మొత్తం	34,388-	31,180	22,01,37,000

సీఎం మేలు మరువలేం



సీఎం జగనన్న చేస్తున్న మేలును ఎప్పటికీ మరువలేం. జగనన్న విద్యాదీవెన పథకంతో నా కుమారుడు మహ్మద్ యూసుఫ్‌ను బాగా చదివించుకుంటున్నాం. ప్రభుత్వం చేస్తున్న సహాయంతో మాలాంటి ఎంతో మంది కుటుంబాల తలరాతలు మారుతున్నాయి. క్రమం తప్పకుండా ఫీజురీయింబర్స్‌మెంట్ నగదు ఖాతాల్లో జమ అవుతోంది. సీఎంకు ఇంటిల్లిపాది రుణపడి ఉంటాం.

– షేక్ సల్మా, విద్యార్థి తల్లి, సోమల

ఎంతో ఉపయోగపడుతోంది



మా భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న మేలు గొప్పది. మాది కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం. ఏటా క్రమం తప్పకుండా జగనన్న విద్యాదీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు నా తల్లి ఖాతాల్లో జమ అవుతోంది. ప్రభుత్వం చేస్తున్న సహాయం నా డిగ్రీ చదువుకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

– సాయి శబరీష్, బీఎస్సీ, తృతీయ సంవత్సరం, రామకుప్పం

ఉన్నత చదువులకు భరోసా..



రాష్ట్ర ప్రభుత్వం విద్యా అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. జగనన్న విద్యాదీవెనతో పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్నత చదువులు చదివే అర్హులైన విద్యార్థులందరికీ లబ్ధి కలిగేలా చర్యలు తీసుకుంటున్నాం. నగరిలో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాం. నేడు సీఎం చేతుల మీదుగా ప్రారంభించే జగనన్న విద్యాదీవెన పథకం కింద జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్నత చదువులు చదివే 34,388 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

విద్యా సంస్కరణల ఆద్యుడు సీఎం జగన్

- ఎన్నికల హామీలు 99 శాతం నెరవేర్చాం
- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నగరి: విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి పలు సంస్కరణలు చేపట్టిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని విద్యుత్, అటవీ, పర్యావరణ శాస్త్ర, సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం జగనన్న విద్యా దీవెన త్రైమాసిక లబ్ధి రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని నగరి నుంచి ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం బహిరంగ సభ, హెలీప్యాడ్ వద్ద శరవేగంగా జరుగుతున్న ఏర్పాట్లను డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త ఎమ్మెల్సీ తలశీల రఘురాం, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్, ఎస్పీ వై.రిశాంత్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నగరి నియోజకవర్గ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపేలా అందరి సమన్వయంతో విజయవంతం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల హామీలను 99 శాతం పూర్తి చేశారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, నాడు–నేడు తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, తంబళ్లపల్లె, సత్యవేడు ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆదిమూలం, డీఆర్ఓ ఎన్.రాజశేఖర్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి, జెడ్పీసీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీపీవో లక్ష్మి, డీపీఎంఓ షణ్ముగం, నగరి, కుప్పం ఆర్డీఓలు సుజన, శివయ్య, తహసీల్దార్ చంద్ర శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంక్రటామిరెడ్డి, ఎంపీడీవో లీలా మాధవి, ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

భక్తజన బోయకొండ

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ దీవెనల కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి క్యూలు భక్తులతో నిండిపోయాయి. కొండ పరిసరాల్లో ఎటు చూసినా భక్త జన సందడి కనిపించింది. ఉదయం ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి.



విశేషాలంకరణలో అమ్మవారు

నేటి స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు రానున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందనను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. అలాగే చిత్తూరులో సోమవారం నిర్వహించాల్సిన పోలీసు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి పేర్కొన్నారు.